# ఒజ్జిన హాళ్ళు

వేమకోటి సీతారామశాస్త్రి



ప్యాసింజరు రైలు కూత వేసి పరిగెత్తడం ప్రారంభించింది. ఫస్టుక్లాస్ కుపెలో ఎవ్వరూ లేరు. నిర్మల ఒక్కర్తే లెదర్ బాక్సు బెర్తుమీద పెట్టి విశ్రాంతిగా కూర్చుంది. ఆమె మనస్సు ప్రశాంతంగా నిర్మలంగా వుంది. ఇంటిదగ్గర ఎప్పుడూ హడావుడి గొడవే. కలెక్టర్ గారి తల్లిగా ఆమెకుండే బాధ్యతలు వేరు. ఆమె కిటికీ బయటనుండి రైలుతోబాటు పరుగెడ్తున్న ప్రకృతిని చూస్తున్నది. చాలా సంవత్సరాల తర్వాత ఈ ప్యాసింజరు ప్రయాణం.

"వెళ్ళక తప్పదాండి ? అని అడిగారు మీ అబ్బాయిగారు," అడిగింది, పెద్ద కోడలు, కలెక్టరుగారి భార్య హోదాలో. అతను ఉదయమే కేంపు కెళ్ళిపోయాడు.

"అవునమ్మా! ఈ ప్రయాణం చేయక తప్పదు. చాలా సంవత్సరాలై పోయింది. యిల్లూ, వాకిలీ, యెంత సంవత్సరమూ శిస్తు పంపిస్తున్నా భూమిని, వొక్కసారి చూసిరావాలనీ, యెలాగా సమయమూ, సందర్భమూ కలిసివచ్చింది," అంది బట్టలు సర్దుకుంటూనే.

"సరే మీ యిష్టం. అవునుగాని ఎందుకండీ మనకా ఇల్లు, పొలమూ. ఎలాగూ వెళ్తున్నారు కదా ? వాట్ని అమ్మేసి, ఆ డబ్బు మీ మనవడిపేర ఫిక్సెడ్ డిపాజిట్ లో పడేసుకుంటే సరి." అంది.

మళ్ళా విస్మయంగా చూసింది నిర్మల. ఇదే సలహా ఒకప్పుడు చిన్నకోడలు, యింజనీరు భార్య హోదాలో చెప్పింది. ఆ యిల్లూ, ఆ పొలం స్త్రీధనం. తనది. రైల్వేస్టేషన్ మాస్టరుగా రిటైరయిన భర్తతో యీ హడావుడి వాతావరణానికి దూరంగా అక్కడ కాలం గడుపుదామంటే ఆ కోరిక తీరకుండానే ఆయన కన్నుమూసారు.

"అలాగే చేస్తానమ్మా," అంది తను. కోడళ్ల మనస్తత్వాలు ఎంత విపరీతంగా ఆర్థికవృత్తంమీద కేంద్రీకరింపబడ్డాయో చూస్తుంటే నిర్మలకు జుగుప్స కలిగింది.

"ఇదిగోనండీ. మూడువందల రూపాయలు యిమ్మన్నారు. మీరు ఫలానా బండిలో వస్తున్నట్లు వారికి ఉత్తరం రాసారు," అంటూ డబ్బు, టికెట్టు చేతికిచ్చింది.

"నేను వెయ్యిరూపాయ లడిగాను. వాడివ్వలేదా !" నీరసంగానే అడిగింది డబ్బును తీసుకుంటూ.

"మీకు తెలియదా అత్తయ్యా! ఇంటి ఖర్చులూ అవీ. యెలా యివ్వగలరు ఆయన. ఏదో సర్దుకోవాలి మనం...." అంది.

అక్కడో క్షణం నిలవకుండానే వెళ్ళిపోయింది. నిస్తేజంగా ఆమెవైపు చూసింది నిర్మల. బేంకుతో వేస్తున్న డబ్బు, ఫిక్సెడ్ డిపోజిట్లమీద వచ్చే వడ్డీలు తను ప్రతీ సంవత్సరం ఇస్తున్న శిస్తు డబ్బుల సంగతి తనకి తెలియదనుకుంది.

"నాన్నమ్మా నేనూ వస్తానే," ఆరేళ్ళ మనవడు పట్టుచీర కొంగుపట్టుకొని అడిగాడు.

"నువ్వెక్కడ కెళతావు! ఆమె పల్లెటూరు వెడుతున్నారు. అక్కడ డర్టీగా వుంటుంది. పద లోపలికి," అంటూ యెంత వేగంగా వెళ్ళిందో అంత వేగంగా వచ్చి వాడ్ని తీసికెళ్ళిపోయింది. చిన్నవాడింట్లోనూ ఇదే తంతు. పిల్లల్ని గూడా సమంగా దగ్గరికి చేరనివ్వదు. అత్తగారితనం నిర్మల యేనాడూ చూపించలేదు కోడళ్ళమీద. కానీ అభిమానం, ఆప్యాయత గూడా ఆమె మనవల్ని మనవరాళ్ళని తాకడానికి వాళ్ళ భర్తల హోదాలు, పుట్టింటివాళ్ళ అంతస్థులూ అడ్డువస్తున్నాయేమో మరి. వాస్తవానికి నిర్మలది ఎడారి జీవనమే.

నిర్మల జీవిత దృశ్యాలు తెగిపోయాయి, రైలు ఆగటంతో. ఆ స్టేషనులో రైల్లో కొద్దిమంది ప్రయాణికులే యెక్కారు. రైలు కదిలింది. తోటి ప్రయాణీకులు గూడా యెవ్వరూ లేరు, కాస్త కాలక్షేపమేనా జరుగును అనుకుంది. సూర్యుడు ఒంటరిగా బంగారు కిరణాల్ని ప్రకృతిమీద కురిపిస్తున్నాడు. రైలుచక్రాల లయబద్ధమైన సంగీతం, నిర్మల హృదయంలో అనిర్వచనీయమైన అనుభూతి కలిగిస్తోంది. పెట్లో టవల్ తీసి ముఖం తుడుచుకుంది. టవల్ క్రింద విశ్వనాథం వ్రాసిన ఉత్తరం కనిపించింది. ఆ ఉత్త

రంలో పంక్తులు మరోసారి చదవా లనిపించింది.

"పెద్దమ్మాయి అరుణ పెళ్ళి నిశ్చయం చేసాం. పదహారవ తారీఖున తెల్లవారు ఝామున పెళ్ళి. అరుణ తర్వాత మరో యిద్దరాడపిల్లలు, ఆ తర్వాత కుర్రాడు. పదేళ్ళ వయస్సులోనే వాడు తల్లిని పోగొట్టుకున్నాడు. పెళ్ళికొడుకు ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో బిల్లు కలెక్టరు. కట్నం ఆరువేలకు నిర్ణయం చేసారు, పెళ్ళి పెద్దలు. నీ శుభాశిస్సులతోనే యీ పెండ్లి జరగాలి. నువ్వు, మీ పెద్దబ్బాయి, చిన్నబ్బాయి, కోడళ్లూ అందరూ వచ్చి, ఈ కల్యాణాన్ని జయప్రదంగా జరిపిస్తా రని ఆశిస్తూ...."

ఉత్తరం మడిచి పెట్లో పెట్టింది. రైలు బయట ప్రపంచంలోని కొండలు, గుట్టలూ, వాగులూ, వంకలు, పొలాలు, ఎత్తుపల్లాలు, ముళ్ళకంపలు మనిషి జీవితంలో కష్టసుఖాల్ని అనుభవిస్తు న్నట్లుగా దాటుకుంటూ రైలు గమ్యం చేరుకోవడానికి వేగం పుంజుకుంది. నిర్మల ఆలోచనలు తన వూరు, జగన్నాధపురం, ఇల్లు, నల్లచెరువు, చెన్నకేశవస్వామి దేవాలయం యివన్నీ గుర్తుకొచ్చాయి. జగన్నాధపురం రైల్వే స్టేషన్ చిన్న ప్లాట్‌ఫారం. అక్కడో తురాయి చెట్టూ, గంగరావి చెట్టూ వుండేవి. దాని ప్రక్కనే పెద్దతోట వుండేది. అందులో గోరింటాకు చెట్లు వుండేవి. అట్లతదియకి విమల, కమల, లలిత, మున్సబుగారమ్మాయి మాధవి అందరూ పోటాపోటీలు పడి అక్కడే గోరింటాకు కోసుకునేవారు. ఆ తోట లోనే ఉయ్యాల లూగేవారు. జగన్నాధ పురంలో తన తండ్రి స్కూలు హెడ్ మాస్టారు. తను వొక్కగా నొక్క సంతానం. చిన్నతనం యెంత తియ్యగా గడిచిందో! ఆమె కనులు చెమర్చాయి.

పొద్దు వాటారింది. నిర్మల దిగబోయే జగన్నాధపురం రైలుస్టేషను దగ్గరకు వచ్చేసింది. స్టేషనులో పెద్దగా మార్పేం లేదు. గంగరావిచెట్టు, తురాయిచెట్టూ బాగానే వున్నాయి. రాలిన పూలు ఎఱ్ఱ తివాచీ పరిచినట్లుంది. తోటలో అదనంగా అంటుమామిడిచెట్లు పళ్ళతో నిండుగా కన్పిస్తున్నాయి. ఆదరాబాదరాగానే తల కాస్తా సర్దుకుని లెదర్‌బాక్సు పట్టుకుని ద్వారం దగ్గరకు వచ్చింది.

స్టేషనులో జనం ఎక్కువగా లేరు. నలుగురైదుగురు మనుషులు తనవేపు రావడం చూసింది. ఆమె గుండెలు గుబ గుబలాడాయి. వధువుగా ఆ వూరును విడిచిపెట్టిన తను విధవగా ఆ వూరు వస్తోంది. ఆ మనుషుల్లో విశ్వనాధం యెవరో గుర్తుపట్టలేకపోయింది.

"దండాలమ్మగోరూ," అన్నారు. అందులో యిద్దరు వయసుమళ్లినవారు. ఆమె చేతిలో పెట్టె అందుకుంటూ -

"ప్రయాణం కులాసాగా జరిగిందా నిర్మలా," అడిగారు అందులో ఒకాయన. నిర్మల ఆపలకరించిన వ్యక్తిని పోల్చుకుంది. ముతక ఖద్దరు బట్టలతో ముక్కున జారుతున్న కళ్ళజోడుతో వయస్సు, అనుభవాలు, కష్టాల రధ చక్రాల క్రింద నలిగిపోయిన జీవన కార్మికుడిలా వున్నాడు విశ్వనాధం.

"ఆ, కులాసాగానే జరిగింది," అంది యేం మాట్లాడాలో తెలియక.

"నే చెప్పలేదటయ్యా విశ్వనాధం. వారు ఫస్టుక్లాసు పెట్టెలో నుండి దిగుతా రని," అన్నాడు మరోవ్యక్తి చొరవగా ముందుకు తోసుకుంటూ వచ్చి. నిర్మల వింతగా చూసింది అతనివేపు

"మన నారాయణ కరణంగారబ్బాయి కరణంగానే పనిచేస్తున్నాడు," అన్నాడు విశ్వనాధం పరిచయం చేస్తూ గుర్తుకు తెచ్చుకోవడానికి నిర్మల చేస్తున్న ప్రయత్నం వ్యర్ధమైపోతోంది.


"ఇంకా గుర్తు రాలేదనుకుంటాను. చిన్నపుడు మీరు ఆడుకుంటూ వుంటే అల్లరిపెట్టేవాడ్ని...." అన్నాడు నవ్వి. నారాయణ.

"ఆ గుర్తుకొచ్చింది," అంది నవ్వి. నారాయణ చిన్నప్పుడు స్కూల్లో గూడా చాలా అల్లరిచేసేవాడు. రైలు మరి ఆగనని చెబుతున్నట్లుగా కూతవేసి కదిలింది.

ఆకాశం అరుణిమను పుంజుకుం టోంది. నలిగిన పట్టుచీరతో, ప్రయాణం అలసట కలిగిన ముఖంతో చిరునవ్వు నవ్వుతూ, పాత జ్ఞాపకాల్ని నెమరువేసు కుంటూ మాట్లాడుతూ హుందాగా నడుస్తున్న స్త్రీమూర్తిని రైల్వే పాయింట్‌మెన్, స్టేషన్ మాస్టర్ కమ్ టిక్కెట్ కలెక్టర్, నలుగురైదుగురు ప్రయాణీకులు వింతగా చూస్తున్నారు. స్టేషను బయట రెండెడ్ల బండి సిద్ధంగా వుంది.

"ఈ ఫర్లాంగున్నర దూరానికి బండి ఎందుకు మీతోబాటు నడిచేదాన్ని కదా." అంది చిరుగాలికి నుదుటమీద పడుతున్న ముంగురుల్ని మీదకు తోసుకుంటూ.

"బలేవారేనమ్మా! కలెక్టర్‌గారి తల్లి గారు. మిమ్మల్ని నడిపించి తీసికెళ్తామా! ధర్మమా." అన్నారు నారాయణ. బండి కదిలింది. నెమ్మదిగా కబుర్లు చెప్పు కుంటూ నడుస్తున్నారు మిగిలినవాళ్లు. విశ్వనాధం వుత్సాహంగా చేతులు తిప్పుతూ మాట్లాడుతున్నారు. నల్లచెరువు గట్టు ఎక్కింది బండి. చాలా విశాల మైన చెరువది. అందులో నీటిపిట్టలు ఆగుతూ, ఎగురుతూ, ఆగుతూ, నీటిలో మునుగుతూ ఆహారం సంపాదించు కుంటున్నాయి. జంటలు జంటలుగా అందులో నల్లకలువలు చంద్రునికి స్వాగతం పలకడానికి సిద్ధంగా ఉన్నాయి. చిన్నతనంలో సాయంకాలం ఆ చెరువు గట్టుమీద కూర్చుని, ఆహారం సంపా దించుకునే నీటిపిట్టల్ని, గేలంవేసి చేపలు



పట్టేవాళ్ళని, తెప్పలమీద తేలిపోతూ తామరాకుల్ని కోసేవాళ్ళని చూస్తూ కాలం గడిపేది. ఆ చెరువు పరిస్థితి అలాగే వుంది. ఒకసారి తుఫానులో ఆ చెరువుకు గండిపడి వూరిని ముంచేస్తుందని తెలిసి విశ్వనాథం వాళ్ళతో తను గూడా రాత్రంతా మేలుకొని వున్న విషయం గుర్తొచ్చింది. ఊళ్ళోకి గట్టు దిగేముందు వొక పుర్రిచెట్టు దానిమీద గబ్బిలాల కీచు శబ్దం సంగీతంలో అపశృతి మేళ వింపులా....

యివన్నీ దాటుకొని బండి ఊళ్ళోకి ప్రవేశించింది. ఊళ్ళో గూడా పెద్ద మార్పేం కనబడలేదు. పోతే పాకల స్కూలు పక్కా బిల్డింగుగా మారింది. కరెంటు వేసినట్లుగా స్తంభాలు కనిపిస్తున్నాయి. ఆ వూరిగుడిసెలు, కరణంగారి పెంకుటిల్లు, మునసబుగారి పాతమేడ అవన్నీ దాటుకుని విశ్వనాథం పర్ణశాల లాంటి వూరిల్లు ముందు ఆగింది. ఇంటి ముందు పెద్ద పందిరి. మామిడాకులుతో వింత వాసన వేస్తున్నది. ముంగిటంతా రంగురంగుల ముత్యాల ముగ్గుతో విద్యుద్దీపం వెలుగులు మెరిసిపోతున్నాయి. పందిరి మధ్య కల్యాణవేదిక. ఊళ్లో పంతులుగారమ్మాయి పెండ్లేమో చిన్న చిన్న పిల్లలు అందరూ గుమిగూడి చూస్తున్నారు. వీధి గడపల్లో నిల్చుని ఆశ్చర్యంగా చూస్తున్నారు ఆడవాళ్లు.

"కలకటేరుగారి తల్లిగోరు వొచ్చేసినారే సీతమప్పా," అంటూ వీధిలో గడపల్లో ఆడవాళ్ల గుసగుసలాడుకుంటూ వింతగా తనవేపు చూడటం నిర్మల కెంతో ఆనందమనిపించింది. ఊరు ఊరంతా తనకోసం యెదురు చూస్తున్నట్లుగా వుండటం తన కెంతో గర్వమని గూడ అనిపించింది నిర్మలకు.

ఇది మా రెండో అమ్మాయి సుమతి. మూడో అమ్మాయి గీత. ఆఖరివాడు వీడు సత్యదేవ్. ఒరేయ్ దండం పెట్టండి," అన్నాడు. ముగ్గురూ కాళ్ళకు వంగి దండం పెట్టారు. తరువాత గీత వెళ్లి కాళ్ల కడుక్కొందికి నీళ్ల తెచ్చింది. సుమతి తువ్వాలు అందించింది. తర్వాత కొంచెం వంగి లోపలికి వెళ్లింది. పూజా మందిరంలో రంగవల్లులు తీర్చిదిద్దుతోంది పెళ్లికూతురు అరుణ.

"అరుణా! చూడు ఎవరొచ్చారో - చూడు," అన్నాడు విశ్వనాథం. ముగ్గును సగంలోనే ఆపి కన్నులు మీదకెత్తి చూసింది. వెంటనే పైట నిండుగా కప్పుకొని నిర్మల పాదాల్ని కళ్ళకద్దుకుంది. రెండు వేడి కన్నీటిచుక్కలు నిర్మల పాదాలమీద పడితే వులిక్కిపడింది. రెండు భుజాలు పట్టి లేవనెత్తి గుండెల్లోనే పొదువుకుంది అరుణను. అరుణ కళ్ళల్లో గంగే పొంగింది.

"మీరు రారేమో ననుకున్నాను పిన్నీ" గాద్గదికంగా.

"ఎందుకు రానమ్మా! నాకు మాత్రం ఎవరున్నారు కనుక," అంది కళ్లు చెమర్చి. విశ్వనాథంకు చుట్టాలు లేరు. తండ్రి విధవా వివాహం చేసుకున్నాడని

ంధువులందరూ అతన్ని దూరంచేస్తే జగన్నాధపురం వచ్చి, మేష్టరుగా నిర్మల తండ్రి వద్దనే పనిచేసేవాడు.

"పాలు తీసుకోండి పిన్నిగారు," అంది సుమతి పెద్ద గ్లాసుతో పాలు తీసుకొని వచ్చి.

"నాకు పాలు వద్దమ్మా! కాఫీ చాలు," అంది నిర్మల.

"మీరు కాఫీ త్రాగుతారా ?" అడిగింది గీత ఆశ్చర్యంగా.

"ఏం" అంది ఆశ్చర్యంగా నిర్మల.

"చాలా గొప్పవాళ్లు కదా! కలెక్టరు గారి తల్లి కదా," అన్నాడు ఆఖరివాడు.

నవ్వి వాడ్ని దగ్గరకు తీసుకొని నుదుటను ముద్దుపెట్టుకుంది. విశ్వనాథం హడావుడిగా బయటకు లోపలకు తిరుగుతున్నాడు పనులమీద.

"మీ రలా కుర్చీలో కూర్చోండి పిన్నీ," అంది నమ్రతగా అరుణ.

"కూర్చోడానికి వచ్చానామ్మా నేను. పద పద. నీకు పనులు సాయంచేస్తా...." నిర్మల అంటూంటే

అరుణ ఆశ్చర్యపోయింది.

"మీరా ?" ఆశ్చర్యంగానే అడిగింది.

"ఏం కలెక్టరుగారి తల్లి పనిచేయ గూడదా !" నిష్ఠూరంగానే అంటూ, ముగ్గుగిన్నె పట్టుకుంది. ఆమెలో ఎంతో వుత్సాహం వచ్చింది. పిల్లలు ముగ్గురూ తల్లికోసం వాచిపోయిన బిడ్డల్లా నిర్మల దగ్గరే వుంటున్నారు.

"భలేవాళ్ళరా! ఆమెచేత పనిచేయిస్తున్నారా!" అన్నాడు కొంచం కోపంగానే, అప్పుడే వచ్చిన విశ్వనాథం.

"వాళ్లేం చేయించటం లేదు. నేనే చేస్తున్నాను," అంది తల ఎత్తి అతని కళ్ళల్లోకి చూస్తూ. మరేం మాట్లాడకుండా వెళ్ళిపోయారు ఆయన.

"పెళ్లికొడుకు నచ్చాడా అరుణా ?" అడిగింది.

సిగ్గుతో అరుణ తల వూపింది. రాత్రి ఏడుగంటలు కావస్తోంది.

"రండి పిన్నిగారూ! పెండ్లిబట్టలు చూపిస్తాను," గదిలోకి తీసికెళ్లింది. గదిలో యిత్తడి బిందె, కొత్త కంచు మరచెంబు, కొత్త గిన్నెలు వొకమూల చక్కగా అమర్చారు.

"యీ నాలుగు నేత చీరెలు నేను డబ్బుతో కొనుక్కున్నాను. ఈ సిల్కు చీర, వారికి డ్రస్సులు నాన్నగారు కొన్నారు...." అంది అరుణ గర్వంగా.

"నీ డబ్బేమిటమ్మా...."

"అవును పిన్నిగారూ! రాట్నంతో నూలు వడికి, అది సంతల్లో అమ్మించి ఆ డబ్బుతో కొనుక్కుంది. మాకు కూడా తలో చీర కొనిపెట్టింది. తమ్ముడికి కూడా వొక మంచి డ్రెస్సు కుట్టించి పెట్టింది," అంది సుమతి ఆనందంగా. ఆశ్చర్యంగా చూసింది నిర్మల.

"అవును పిన్నిగారూ! నాన్నగారు ఉద్యోగం నుండి రిటైరయిపోయారు. వచ్చే ఆదాయం తక్కువ. నేను ఎక్కువగా చదువుకోలేదు. రాట్నం తీసూ ఆ డబ్బుతో వేనీళ్ళకు చన్నీళ్ళలా కాలక్షేపం చేస్తున్నాను. ఎలాగా నేను ఇంకో యింటికి వెళ్లిపోతున్నాను. ఇంత కాలం నా రక్తం పంచుకొని పుట్టిన అనుబంధానికి వాళ్ళ కామాత్రం...." మాట్లాడలేకపోయింది అరుణ. వాత్సల్యంగా తల నిమిరింది నిర్మల.

"ఇదిగో నిర్మలా నీ వొకసారి వీధిలోకి వస్తావా. నిన్ను చూద్దామని వూళ్లో ఆడవాళ్ళందరూ వచ్చారు...." అన్నారు నిర్మలను చూస్తూ విశ్వనాథం. బయట చాలామంది పల్లెజనం దండం పెట్టారు.

"అమ్మగోరూ! మా వూరికి మీ అబ్బాయిగోరు కలకటేరుగా రారండి" అడిగిందో నడివయసుక్కురాలు.

"రారమ్మా! యింకో రాష్ట్రంలో పనిచేస్తున్నాడు. చాలాకాలం పడుతుందేమో మీ జిల్లాకు రావటానికి," అంది నిర్మల. వాళ్ళందరికి తనని హెడ్మాష్టరు గారి కూతురన్న దృష్టికన్నా కలెక్టరు తల్లినన్న గౌరవమే ఎక్కువగా వుందని గ్రహించింది.

రాత్రి తొమ్మిది దాటింది. పెండ్లియత్నాల బడిలికలో భోజనం కానిచ్చి చాలామంది పడుకున్నారు. విశ్వనాథం బజంత్రీవాళ్ళకు తెల్లవారుఝామున రమ్మని మరోమారు హెచ్చరించి మగ పెండ్లివారి విడిది వేపు బయల్దేరారు.

"పిన్నీ నీకు మీ యింట్లో పరుపు మంచం వేసాను," అంది. గీత పక్కయిల్లే నిర్మలది.

"వొద్దమ్మా! నేను యిక్కడే మీ దగ్గరే పడుకుంటాను," అంది. పిల్లలెంతో సంతోషించారు.

"పడుకోండి ! తెల్లవారుఝామున లేవాలి," అంటూనే వాళ్ళమధ్యనే నడుం వాల్చింది. ప్రయాణ బడలికలో ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదామెకు.

అర్ధరాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చింది. విశ్వనాథం పిలుస్తున్నారు. లేచింది ఆశ్చర్యంగా. నేలమీద పడుకోవడం అలవాటులేదేమో వొళ్ళంతా నొప్పిగా వుంది.

"నీతో కొంచెం మాట్లాడాలి రా," అన్నారు విశ్వనాథం.

పైట భుజంనిండుగా కప్పుకుంటూనే దేవుడి గదిలోకి ఆయన వెనకనే నడిచింది. ఇద్దరూ చిరిగిపోయిన కర్జూరపు చాపమీద కూర్చున్నారు. నిర్మల ఆశ్చర్యంగా విశ్వనాథంవేపు చూస్తోంది.

"ఏదో నిర్మలా యిప్పటికి నీ దయ వల్ల అంతా సవ్యంగా జరిగింది. పిల్లకి చీర, సారెలన్నీ సమకూర్చాను." అన్నాడు.

"అవును చూసాను. పిల్లలు నిజంగా

మణిదీపాలు. వాళ్లు అదృష్టవంతులవుతారు," అంది.

"ఇంక మిగిలింది కట్నం సొమ్ము. మగపెళ్లివారు పెళ్లిముందుగానే యిమ్మన్నారు."

"అవును నిజమే! యిప్పుడిస్తే అప్పుడివ్వం. అప్పుడిస్తే ఇప్పుడివ్వం కదా! యిచ్చేస్తే సరి," అంది నిర్మల.

అరుణ వినయం, నమ్రత, ఆప్యాయత, అభిమానం అన్నీ నిర్మలని ముగ్ధురాలని చేసాయి. పెళ్లిలో ఘనంగా రెండు నూట పదహార్లు చదివించి వెళ్లేటప్పుడు సెకెండు క్లాసులో ప్రయాణిద్దామని నిశ్చయించుకుంది. ఇద్దరి మధ్యా కాస్సేపు నిశ్శబ్దం.

"మరి తొందరగా యిచ్చివస్తే సరి. కాస్సేపు నడుం వాల్చవచ్చు," హెచ్చరించింది నిర్మల ఆయన్ని. అతని నుదురు అనుభవం నేర్పిన పాఠాలతో ముడుతలు పడివుంది. కళ్లు లోతుకుపోయి వున్నాయి.

"నిజమే నా దగ్గర వెయ్యి రూపాయలున్నాయి. మిగిలినది నీవు సర్ది పెట్టు. ప్రావిడెంటు ఫండు రాగానే సర్దేస్తాను," అన్నారు విశ్వనాథం.


నిర్మల తలమీద పిడుగుపడినట్లైంది.

"నేనా! అంత డబ్బు తేలేదే. అయినా యిలాంటి విషయంలో నీవు ముందుగా రావడంగానీ లేక నీవు ముందుగా వుత్తరం రాయడంగానీ చెయ్యాలి. అంతేగానీ ఎంత కలెక్టరు తల్లినయినా వేలకు వేలతో ప్రయాణం చేస్తాననుకున్నావా?" అంది.

నిరుత్తరులయ్యారు విశ్వనాథం.

"ఈ విషయం ఉత్తరంలో రాసాను," అన్నారు నెమ్మదిగా.

"యిలా డబ్బు సర్దుబాటు చేయమని వుత్తరంలో రాయలేదే. కట్నం పరిష్కారం రాస్తూ నన్ను వచ్చి ఆశీర్వదించమన్నావు. అంతే వచ్చాను," అంది.




విశ్వనాథం నీతి నిజాయితీ తనకి చాలా సంవత్సరాలుగా తెలుసు. రైతు దగ్గరనుండి శిస్తులు ప్రతి సంవత్సరం వసూలుచేసి పెరట్లో వున్న కాస్త స్థలం కూరాకులవాళ్ళకి కౌలుకిచ్చి ఆ డబ్బు నయాపైసలతో గూడా పంపించేవాడు అతడు.

"నిజమే మొదటి నుండీ నా తత్వమే అంత. బడిపంతులు వుద్యోగం చేస్తూ నీతిపాఠాలు బోధించి దారిద్ర్యాన్ని బహుమతిగా సంపాదించుకున్నాను. నా క్కావల్సింది నిర్దుష్టంగా చెప్పలేకపోయాను. నీవు గ్రహిస్తావనుకున్నాను," అన్నాడు దోషిలా తలవంచుకొని.

"అయితే యిప్పుడేం చేస్తావు?"

"ఏం తోచకుండా వుంది."

"మొగపెళ్లివారితో కొంచం సర్ది చెప్పు. కొన్ని రోజుల్లో సర్దుబాటుచేస్తామని."

"కానీ ఒప్పుకోరు. అనుకున్న కట్నంకు వొక్కపైసా తక్కువయినా అమ్మాయి మెళ్ళో పుస్తెకట్టమని తెగతెంపులు చేసి చెప్పేసారు. ముందుగా అందజేయకపోతే తెల్లవారుఝామున ప్యాసింజరుకు వెళ్లిపోతున్నారు," అన్నారు నీరసంగా.


"పోనీ వూళ్లో యెక్కడయినా అప్పుగా ప్రయత్నించు."

"ఆ కవి యెవరో రాసినట్లు ఊరు కాదిది. వల్లకాడిది. నిర్ధనుడ్ని, నాకు యెవరిస్తారు అప్పు. అన్ని ప్రయత్నాలు చేసి విఫలమయి ఆఖరి ప్రయత్నంగా ఈ గుండెలమీద తొలికుంపటిని వదిలించుకుందామని నీకుత్తరం రాసాను," అన్నారు సిగ్గుతో తలవంచుకొని. గదిలో గోడమీద పూర్వకాలంనాటి జపాన్ గోడ గడియారం పదకొండు గంటలు కొట్టింది. శుభముహూర్తానికి యింకా కొద్దిగంటలే వ్యవధి. ఆ కన్నెపిల్ల జీవితం భగ్నం కాకూడదు.

"అయితే యిప్పుడేం చేద్దాం?" అంది బాధ్యతాయుతంగానే నిర్ణయానికి వచ్చి.

"అదే యేమీ తోచటం లేదు. నీ మీదనే కొండంత ఆశలు పెట్టుకున్నాను యింతవరకూ...." మరి మాట్లాడలేక పోయాడు.

"కరణంగార్ని ఒకసారి పిలుస్తే సరి...."




"అతను బయటే వున్నాడు" అంటూ పిల్చుకొచ్చారు.

"చూడండి కరణంగారూ! నాకు సరియైన పద్ధతిలో ఉత్తరం రాయలేదు విశ్వనాథం. ఈ పెళ్లి ఆగిపోకుండా చూసే బాధ్యత మీది. నా పొలం, ఇల్లూ రెండూ అమ్మివేస్తాను, ఈ రాత్రే. కానీ యీ పెళ్లి మాత్రం ఆగిపోకూడదు," అంది దృఢంగా. శ్రోతలిద్దరూ ఆశ్చర్యపోయారు.

"ఈ కొన్ని గంటల వ్యవధిలో యెవరు కొంటారమ్మా."

ఏం చేస్తారో మీకుండే పలుకుబడి తెలివి యోగించి చిన్ననాటి మన స్నేహితుని కామాత్రం సహాయం చేయండి," అంది. వాళ్ళకు కన్నీరు కనబడకుండా వొత్తుకుని. వెళ్లిన కాస్సేపటికే తిరిగి వచ్చేసారు యిద్దరూ.

సుబ్బిశెట్టి ఎకరాన్నర పొలం, ఇల్లూ కలిసి నాలుగువేలకు అడిగాడు, దౌర్భాగ్యుడు. ఒకరి అవసరం మరొకరి అవకాశం," అన్నారు కరణం కోపంగానే.

"ఇంతేనా," అంది బాధగా విశ్వనాథ్నగారివేపు చూస్తూ.

"అప్పటికీ చెప్పాను, మాగాణిభూమి ఆరువేల పైచిలుకు చేస్తుందిరా! రెండు గదుల పాత పెంకుటిల్లు యెంత పాతదయినా మేష్టారి నిర్వహణలో శుభ్రంగా వుందిరా. అదో నాలుగువేలు కిమ్మత్తు చేస్తుందని మొత్తం హీన క్రయాని కమ్మినా పదమూడువేలు చేస్తుందని - పదివేలిమ్మన్నాను. కానీ..."

"పోనీ కనీసం ఐదువేలిమ్మన్నాడి చాలు," అంది నీరసంగా.

"లేదమ్మా! వాడు నాలుగువేలుకి నయాపైసా ఎక్కువ యివ్వడు. అది గూడా యిప్పుడు కావలిస్తే వెయ్యి రూపాయిలే యిస్తాడుట...." అన్నాడు నిరాశగా కరణం.

ముగ్గురికీ ఏంచేయాలో తోచలేదు. గోడ గడియారం మూడు గంటలు కొట్టింది. మొండి ధైర్యంతో మొగపెళ్లివారి వద్దకు యిద్దర్నీ తీసికెళ్లింది. పెళ్ళయిన కొద్దిరోజులు మాత్రమే వ్యవధి కావాలని అడిగింది. కానీ అంగీకారం కుదరలేదు. మగపెళ్లివారు మూటాముల్లె సర్దుకున్నారు. యిల్లూ పొలమూ వారిపేర రాస్తానన్నా అంగీకరించలేదా మూర్ఖులు.

"నువ్వేం అధైర్యపడకు విశ్వనాథం ఇంతకన్నా మంచి సంబంధం చేద్దాం అమ్మాయికి," అని ఓదార్చింది, కన్నీళ్లు పెట్టుకున్న విశ్వనాథాన్ని కరణం గూడా ధైర్యం చెప్పారు.

"నీకు తెలీదు నిర్మలా! యెంత బాధలు పడి ఈ సంబంధం కుదుర్చుకొచ్చానో. పీటలమీద పెళ్లి తప్పిపోయిందని తెలిస్తే యింకెవరయినా అరుణను చేసుకుంటారా," అన్నారు గాద్గదికంగా.

"అరుణకేం మాణిక్య దీపం. దాని అదృష్టంకొద్దీ ఈ పెళ్లి తప్పిపోయిందని అనుకో. మా అబ్బాయితో చెప్పి మంచి సంబంధం తెస్తాను," అంది గాంభీర్యంగా నిర్మల.

ఆ తెల్లవారుఝామున ఆ పచ్చని తోరణాల పందిట్లో బాజా బజంత్రీలు మ్రోగుతుండగా పెళ్లి కాలేదు. కానీ.... కానీ.... ఆ గృహయజమాని జీవితం తెల్లారిపోయింది, నల్లచెరువులో : ఆ పచ్చతోరణాల పందిట్లో, బాజాభజంత్రీలు మ్రోగుతూండగా రెక్కలు తెగిన పక్షుల్లా ఆ కుటుంబ సభ్యులు, స్నేహితులూ, ప్రజలూ అందరూ భోరున యేడుస్తుండగానే విశ్వనాథంగారి శవానికి పాడె కట్టారు. నిర్మలకు అంతా అయోమయమైపోయిందిది. తను వచ్చి యిరవై నాలుగు గంటలు కాలేదు. మమతా, బరిధాలు, బాధ్యతలు మధ్య నలిగిపోయిన విశ్వనాథం అన్నీ తెంచుకొని యెవ్వరితోనూ చెప్పకుండా, యెవ్వరికీ కూత వేటు కందనంత దూరం పారిపోయాడు. చలించిపోయింది నిర్మల.

* * *

రైలు కదలడానికి సిద్ధంగా వుంది. పిల్లలు నలుగురూ స్టేషనుకు వచ్చారు. వాళ్ళ కన్నీటి తెరలు ఆమె మూర్తిని సమంగా చూడనివ్వటం లేదు. ఆ వున్న పదిహేను రోజుల్లోనూ అంత దగ్గరగా అతుక్కుపోయారు. నలుగుర్నీ దగ్గరకు తీసుకుంది.

"అమ్మా! అరుణా యీ ఎనిమిది వేల రూపాయలు నీ దగ్గర వుంచు. నీకు ప్రత్యేకించి చెప్పవలసిన విషయాలు లేవు. ప్రాజ్ఞురాలివి. నీ జీవితాన్ని సరిదిద్దు




కుని పిల్లల్ని అభివృద్ధిలోకి తీసుకురా. కరణం మామయ్యగారు! నీకు ఇహ నుంచి తల్లయినా, తండ్రయినా వారే. ఏదైనా అవసరమయితే నాకు రాయి. అన్నట్లు మంచిరోజు చూసుకొని నా యింట్లోకి వచ్చేయి. ఆ యిల్లు మీపేర రాసాను," అంది నిర్మల.

"తప్పకుండా తల్లీ. మీరింత చేయగా లేందీ నేనా మాత్రం వాళ్ళకి అండగా వుండలేనా," అన్నారు కరణంగారు బొంగురుపోయిన గొంతుతో.

రైలు కదులుతున్నా ఆ పిల్లలు నిర్మలను విడవలేకపోయారు. యేమిటో అనుబంధం విచిత్రంగా వుంటుంది. రైలు వేగంగా నడక ప్రారంభించింది. తురాయిచెట్టు, గంగరేగుచెట్టు, మామిడి తోట, నల్లచెరువు ఆ తర్వాత కరణం యిల్లూ అలా దృష్టి తన యింటిమీదకు వచ్చి ఆగిపోయింది. సిగ్నలివ్వలేదు. విశ్వనాథం పోయిన నాలుగైదు రోజుల తర్వాత తన యింటి తాళం తీసి లోపలికి వెళ్లింది. పరిశుభ్రంగా వుంచారా ఇంటిని, పరిసరాల్ని. రెండోగదికి తాళంవేసి ఉంది గీతను పిలిచి అడిగింది ఆశ్చర్యంగా.

"అవును పిన్నీ! నాన్నగారు ఆ గది తాళం మాత్రం మాకు యిచ్చేవారు కాదు. రోజూ వుదయమో, సాయం కాలమో ఆ కుర్చీలో అక్కడే ఆ పెట్టెను తెరచి చూస్తూ కూర్చునేవారు. నాన్నగారి పెట్లో వుందేమో తాళం," అంటూనే క్షణంలో వెళ్లి తీసుకువచ్చింది.

ఆశ్చర్యంగానే తాళం తీసింది తను. ఆ గదిలో ఏమీ లేవు. ఒక పాతపడిన మడతకుర్చీ, దాని ప్రక్కనే చందనపు బొట్టుపెట్టె తప్ప యింకేమీ లేవు. ఆ పెట్టె చిన్నప్పుడు తనకి అమ్మ యిచ్చిన పెట్టె. ఆ పెట్టె తెరచి చూసింది ఆతృతగా.

అందులో చిన్నప్పుడు తనూ, విశ్వనాథం, పొరుగింటి కమల, విమల, లలిత అందరూ కలిసి ఆడుకునే గుజ్జన గూళ్ళ సామగ్రి చింతపండు గుల్లలు, లక్కపిడతలు, చింకి పట్టు పీలికలు, చేతులు విరిగిన చందనం బొమ్మలు, యివన్నీ చక్కగా అమర్చబడి ఉన్నాయి. చాలాసార్లు గుజ్జెనగూళ్ళలో తనూ, విశ్వనాథం, భార్యాభర్తలుగా వ్యవహరించేవారు. నిజంగా పోట్లాడుకునేవారు. తనకి వుక్రోషం వచ్చి ఏడ్చేది.

"ఎందుకు ఏడుస్తావు. ఇది గుజ్జెన గూళ్లాటని మరచిపోయావా?" అనునయించేవాడు విస్సు అనబడే విశ్వనాథం అర్థంకాక అయోమయంగా చూసేది.

"మా బామ్మ గుజ్జెనగూళ్లాట అంటే యేమని చెప్పిందంటే సంసారం శిక్షణ యిచ్చే ఆట అని చెప్పింది," మనం వుత్తుత్తి మొగుడి పెళ్లాల," అంటూ చెప్పి బుజ్జగించి నవ్వించేవాడు.

కానీ అవన్నీ తను మరిచిపోయింది. కానీ అయన మరచిపోలేరు. జీవితాంతం ఎదలో - ఎదలో నిండుగా నిలుపుకొని ఆ గుజ్జెనగూళ్ళని ఆరాధించాడు. ఎంత గొప్ప జీవితం! ఎంత ఆర్ద్రత....

కదిలిన రైలు వేగం పుంజుకుంది. రైలు చుట్టూ కొండలు, వాగులూ, తోటలూ, పొలాలు ప్రకృతి పరిణామాన్ని సూచిస్తూ ఒకదాని తరువాత ఒకటి పరిభ్రమిస్తున్నాయి. వెనక్కి వెళ్లి పోతున్నాయి.

నిర్మల మనస్సులో విశ్వనాథం ...గుజ్జెనగూళ్లు - ఆయన బ్రతుకు అంతరాంతరాల మధ్య దాగిన జీవన సత్యాన్ని ఆరాధనాభారాన్ని ప్రతిధ్వనిస్తూ పరిభ్రమిస్తున్నాయి.

———